క్లుప్తంగా

మారెమ్మకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకారంలో మారెమ్మ

పుంగనూరు: పట్టణంలోని విరూపాక్షి మారెమ్మ ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమావాస్యను పురస్కరించుకుని అమ్మవారిని విశేషంగా అలంకరించి రాహుకాల పూజలు జరిపించారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి మారెమ్మతల్లిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. గుమ్మడికాయలు, నిమ్మకాయలతో దీపాలు వెలిగించారు. అనంతరం నిర్వాహకులు భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

10లోపు డిగ్రీలో ప్రవేశానికి దరఖాస్తులు

పుంగనూరు: పట్టణంలోని శుభారాం డిగ్రీ కళాశాలలో ఓపి ఎండీసీ కోర్సుల్లో ప్రవేశానికి విద్యార్థులు ఈ నెల 10వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ డాక్టర్ రాజశేఖర్ కోరారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ 11 నుంచి 15వ తేదీ వరకు సబ్జెక్టులు ఎంపిక చేసుకునే అవకాశం ఉంటుందని వెల్లడించారు. ఈ మేరకు 19వ తేదీన సీట్లు కేటాయించనున్నట్లు చెప్పారు. కళాశాలలో బీఎస్సీ మ్యాథ్స్, బీకామ్, బీఏ కోర్సులు అందుబాటులో ఉన్నాయని, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ , కంప్యూటర్, వైఫై సౌకర్యాలు ఉన్నట్లు వివరించారు.

నేడు జూనోసిస్ డే

పుంగనూరు: అంతర్జాతీయ జూనోసిస్‌డేను శనివారం నిర్వహించనున్నట్లు ఏడీ డాక్టర్ మనోహర్ తెలిపారు. ఈ సందర్భంగా పెంపుడు కుక్కలకు యాంటీ ర్యాబిస్ వ్యాక్సిన్‌ను ఉచితంగా వేయనున్నట్లు వెల్లడించారు. పెంపుడు కుక్కల యజమానులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో రాహుకాల అభిషేకం



ప్రత్యేక అలంకరణలో గంగమ్మ

చౌడేపల్లె: బోయకొండ గంగమ్మ ఆలయంలో శుక్రవారం భక్తిశ్రద్ధలతో రాహుకాల అభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువజామునే ఆలయాన్ని శుద్ధి చేశారు. గర్భాలయాన్ని మామిడి, వేపాకు, పూల తోరణాలతో అలంకరించారు. అనంతరం ఉదయం 10.30 నుంచి 12 గంటల మధ్య విశేషంగా రాహుకాల అభిషేకం జరిపించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. మహిళలు ఉపవాస దీక్ష పాటించి ఆలయం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. ఈ క్రమంలో ఉభయదారులకు అమ్మవారి పవిత్ర తీర్థ ప్రసాదాలను అధికారులు పంపిణీ చేశారు.

పలమనేరులో నీటి నాణ్యతపై పరీక్షలు

పలమనేరు: పురపాలక పరిధిలోని నీటి సంపులు, ఓవర్ హెడ్ ట్యాంకులను శుక్రవారం మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి, ఇంజినీరింగ్ సిబ్బందితో కలసి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా సంపులతోపాటు 60 బోర్ల నుంచి సరఫరా అవుతున్న నీటి నాణ్యతను తనిఖీ చేశారు. నీటి శాంపుళ్లు సేకరించి క్లోరోస్కోప్ ద్వారా పరీక్షలు నిర్వహించారు. ప్రజలు నీటిని ఎక్కువ రోజులు నిల్వ చేసుకోకుండా సేవించాలని సూచించారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం



మాట్లాడుతున్న హెల్త్ ఎడ్యుకేటర్ కాంతమ్మ

బైరెడ్డిపల్లె: వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయని, విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని హెల్త్ ఎడ్యుకేటర్ కాంతమ్మ తెలిపారు. శుక్రవారం లక్కనపల్లె జెడ్పీ ఉన్నత, ప్రాథమిక పాఠశాలల్లోని విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రతపై తీర్థం పీహెచ్‌సీ వైద్య సిబ్బంది అవగాహన కల్పించారు. కాంతమ్మ మాట్లాడుతూ చిన్న చిన్న వ్యాధుల బారిన పడినప్పుడు అశ్రద్ధ వహించకుండా సమీపంలోని వైద్యాధికారులను సంప్రదించాలని సూచించారు.

డివైడర్‌ను ఢీకొన్న పాల ట్యాంకర్

పలమనేరు: పట్టణంలోని గుడియాత్తం సర్కిల్‌లో శుక్రవారం సముద్రపల్లె నుంచి బెంగళూరుకు వెళుతున్న పాల ట్యాంకర్ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొంది. ఆ సమయంలో వర్షం కురుస్తుండడంతో డివైడర్ వద్ద ఎవరూ లేకపోవడం వల్ల పెద్ద ప్రమాదం తప్పింది.

మినుము



సోయా చిక్కుడు



వాము



పెసర



సజ్జ



చిరు పెట్టుబడితో సిరులు!



పడమటి మండలాల్లో వేరుశనగ సాగుపై అధిక శాతం రైతులు ఆధారపడ్డారు. అయితే ఏటా వాతావరణం అనుకూలించక పెట్టుబడి కూడా రాకపోవడంతో దిగాలు పడుతున్నారు. ఈ తరుణంలో ప్రత్యామ్నాయంగా చిరుధాన్యాల సాగు ఆశాజనకంగా ఉండడంతో అన్నదాతలు ఆ దిశగా ఆసక్తిచూపుతున్నారు. ఖరీఫ్‌లో వర్షాలు సమృద్ధిగా కురుస్తున్నందున ఈ పంటల సాగుకు సమయమిదే అని వ్యవసాయశాఖ అధికారులు సూచిస్తున్నారు. చీడపీడల బెడదతోపాటు పెట్టుబడి వ్యయం తక్కువగా ఉండడంతో అధిక ఆదాయం పొందవచ్చని వెల్లడిస్తున్నారు.

- లాభదాయకంగా చిరుధాన్య పంటలు
- సాగుకు ఇదే మంచి తరుణం
- మార్కెట్‌లో పెరిగిన డిమాండ్
- మెట్ట భూముల్లో సైతం అధిక దిగుబడి
- ఆసక్తి చూపుతున్న అన్నదాతలు

పలమనేరు: వర్షాధారంతో సాగు చేసే చిరుధాన్య పంటలపై రైతులు మక్కువ చూపుతున్నారు. పెద్దగా పెట్టుబడి పెట్టాల్సిన పనిలేకపోవడంతో ఎక్కువ మంది సాగుకు సన్నద్ధమవుతున్నారు. తెగుళ్ల బెడద తక్కువగా ఉన్న కారణంగా పురుగు మందులు, ఎరువులకు ఖర్చు పెట్టాల్సిన అవసరం లేదని వ్యవసాయాధికారులు సైతం చెబుతున్నారు. వర్షాకాలం నేపథ్యంలో చిరుధాన్య పంటల సాగుకు శ్రీకారం చుడితే లాభదాయకంగా ఉంటుందని సూచిస్తున్నారు. ఈ క్రమంలోనే మార్కెట్‌లో ప్రస్తుతం చిరుధాన్య ఉత్పత్తులకు మంచి డిమాండ్ ఉందని వెల్లడిస్తున్నారు. అవకాశాలను అందిపుచ్చుకుని అన్నదాతలు ఆదాయ మార్గంలో పయనించాలని కోరుతున్నారు. ముఖ్యంగా వర్షాధారిత చిరు పంటలైన ఉలవ, రాగి, పెసర, మినుము, కంది, జొన్న, జనుము, పిల్లి పెసర, సజ్జ, కొర్ర, మినుము, సోయా చిక్కుడు, వాము, మొక్కజొన్న, దనియాలును సాగు చేయడం ఉత్తమమని తెలియజేస్తున్నారు. ఇప్పటికే కొందరు రైతులు ఈ పంటలను ఏటా సాగుచేస్తూ అధిక లాభాలను గడిస్తున్నారని వివరిస్తున్నారు.

కంది: సెప్టెంబర్ 15వ తేదీ నుంచి కందిని సాగు చేసుకోవచ్చు.ఎకరాకు ఆరు కిలోల విత్తనం సరిపోతుంది. నాలుగునెలల్లో పంట చేతికొస్తుంది. పొలం గట్లపై కూడా సాగు చేసుకోవచ్చు. ఎకరాకు 5నుంచి 6 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. ప్రస్తుతం చేనులను బీడుగా ఉంచుకున్న రైతులు కందులు వేసుకోవచ్చు. సుమారు రూ.20వేల నుంచి రూ.25 వేల వరకు ఆదాయం పొందవచ్చు.

జొన్న: తెగుళ్ల సమస్యలేని పంట జొన్న. దీని సాగుకు ఇదే మంచి తరుణం. ఎకరానికి 40 క్వింటాళ్ల దాకా దిగుబడి వస్తుంది. ఖర్చులు మినహాయిస్తే రూ.30 వేల వరకు ఆదాయం పొందవచ్చు. దీని ద్వారా పశువులు మేత కూడా దొరుకుతుంది. పశు సంవర్ధకశాఖ రాయితీతో విత్తనాలను సరఫరా చేస్తోంది.

మినుము: మార్కెట్‌లో మినుములకు మంచి గిరాకీ ఉంది. అక్టోబర్ నుంచి సాగు చేసుకోవచ్చు. పంటకాలం 80 రోజులు. ఎకరా సాగుచేస్తే 8 నుంచి పది క్వింటాళ్ల పంట దిగుబడి ఉంటుంది. తద్వారా రైతు రూ.90 వేల వరకు సంపాదించుకోవచ్చు. పశు గ్రాసంగా కూడా రైతులకు ఉపయోగపడుతుంది.

సోయా చిక్కుడు: వర్షాధారంగా నల్లరేగడి నేలల్లో సోయా చిక్కుడు సాగుచేసుకోవచ్చు. ఎకరానికి 8 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుంది. పస్తుతం క్వింటాల్ రూ.5వేల దాకా పలుకుతోంది. ఖర్చులు పోనూ రూ.30 వేల వరకు ఆదాయం పొందవచ్చు. సన్న చిన్నకారు రైతులకు ఈ పంట సాగు ప్రయోజనకరం.



దనియాలు: ప్రస్తుతం దనియాల సాగు రైతులకు వరంలా మారింది. నీటి తడులతోనూ, వర్షాధారంగానూ దీన్ని సాగు చేయవచ్చు. కొత్తిమీరను సైతం మంచి ధర పలికితే అమ్ముకోవచ్చు. ఎకరానికి 5 నుంచి 8 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుంది. పంట ఖర్చులు పోనూ ఎకరాకి రూ.40 వేల వరకు ఆదాయం ఉంటుంది. పంట కేవలం 80 రోజులే కావడంతో రైతులకు ఎంతో మేలు.



కొర్రలు: ఖరీఫ్, రబీ రెండూ సీజన్‌లలోనూ సాగుచేసుకోవచ్చు. పంట కాలం కేవలం70 రోజులు మాత్రమే. ఎకరానికి 10 నుంచి 12 క్వింటాళ్ల దిగుబడిని పొందవచ్చు. ఖర్చులు పోనూ రైతుకు ఎకరానికి రూ.30 వేల వరకు ఆదాయం లభిస్తుంది. ప్రస్తుతం కొర్రలకు మంచి డిమాండ్ కూడా ఉంది.

వాము: భూమిలో తగినంత తేమను నిలుపుకొనే శక్తి కలిగి, సారవంతమైన భూముల్లో వర్షాధారంగా ఈ పంటను సాగుచేసుకోవచ్చు. సెప్టెంబర్ మొదటి వారంలో విత్తుకోవడానికి అనుకూలం. ఎకరానికి 4 నుంచి 6 క్వింటాళ్ల వరకు పంట దిగుబడి ఉంటుంది. మార్కెట్‌లో ప్రస్తుతం క్వింటాల్ ధర రూ.10 వేల వరకు ఉంది. దీంతో రూ.40 వేల ఆదాయం ఉంటుంది.

మొక్కజొన్న: తక్కువ పెట్టుబడితో ఎకరానికి రూ. 20 వేల దాకా నికర ఆదాయం పొందవచ్చు. పంట కాలంలో కనీసం మూడు దఫాలు నీరు సరఫరా చేస్తే చాలు పంట చేతికొస్తుంది. ఎక్కువగా వర్షాధారంతో పంట సాగు చేసుకోవచ్చు. ఎకరానికి 35 క్వింటాళ్ల దిగుబడి పొందవచ్చు. పశుగ్రాసం గానూ అదనపు ఆదాయం వస్తుంది.

పెసర: చౌడు నేలల మినహా మిగిలిన ఏనేలల్లోనైనా దీన్ని విత్తుకోవచ్చు. సెప్టంబరు మొదటి వారం నుంచి విత్తుకోవచ్చు. వెదజల్లితే ఎకరానికి ఏడుకిలోల విత్తనాలు అవసరం. మంచి యాజమాన్య పద్ధతులతో ఎకరానికి ఆరు క్వింటాళ్ళు దిగుబడి వస్తుంది. ప్రస్తుతం ధర క్వింటాళు రూ.5వేల దాకా ఉంది.

సజ్జలు: నీరు నిలవని అన్నిరకాల నేలలు దీని సాగుకు అనుకూలం. 70 నుంచి 90 రోజులు పంట కాలం. ఎకరానికి రెండు కిలోల విత్తనం అవసరం. సజ్జ పంటలో ప్రధాన కంకి మొదట కోతకు వస్తుంది. ఆపై పిలక కంకులను మూడు, నాలుగు దశల్లో కోయాలి. కోసిన కంకులను ఆరబెట్టి నూర్పిడి చేసుకోవాలి. సజ్జకు ఇప్పుడు మంచి గిరాకీ ఉంది.

కచ్చితంగా నష్టాలు రావు



చిరుధాన్యాలైన ఉలవ, కంది, జొన్న, అనప, తదితర పంటలు సాగు చేసుకుంటే రైతులకు కచ్చితంగా నష్టాలు రావు. వేరుశనగ పంటకు ప్రత్యామ్నాయంగా ఖరీఫ్ నుంచి అదును చూసి చిరుధాన్యాలను సాగుచేకోవడం ద్వారా రైతులు నికరమైన ఆదాయం పొందవచ్చు. అన్నదాతలకు ఆర్థికంగా వెసులుబాటు వస్తుంది. చిరుధాన్యాలతో తయారైన ఆహారంపై ప్రజలు సైతం ఆసక్తి చూపుతున్నారు. –అన్నపూర్ణాదేవి, వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు, పలమనేరు

అదనపు ఆదాయం



వేరుశనగ సాగుకు రైతులు ఎకరాకు రూ.10వేల నుంచి 15 వేల దాకా పెట్టుబడిగా పెట్టాలి. అయితే వర్షాలు కురిసి మంచి దిగుబడి వస్తే సరే లేకుంటే నష్టం వస్తుంది. అందుకే వేరుశనగ పొలంలోనే ఉలవను సైతం జల్లుకోవచ్చు. ఇది పూర్తిగా వర్షాధారమే. వేరుశనగ ఒబ్బిడి చేసుకున్నాక ఇది చేతికొస్తుంది.దీని ద్వారా ఎకరాకు రూ.10వేల దాకా అదనపు ఆదాయం పొందవచ్చు. చిరుధాన్యాలతో రైతులకు నష్టాలు రావు. –సంధ్య, ఏఓ, పలమనేరు

రాగులు: రైతులకు రాజపంటగా పేరుగాంచిన రాగులుతో రైతుకు ఎప్పుడూ నష్టం రాదు. రబీ సీజన్‌లో అయితే నవంబర్ నుంచి సాగు చేసుకోవచ్చు. వకుళ అనే రకం మంచి దిగుబడులనిస్తోంది. కేవలం వందరోజుల్లోనే పంట చేతికొస్తుంది. ఎకరాకు 13 నుంచి 15 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుంది. నారు పోసుకోవడానికి రెండున్నర కిలోల విత్తనం చాలు. వెదజల్లితే ఎకరానికి నాలుగు కిలోల అవసరముంది. క్వింటాల్ ధర రూ.3వేల దాకా ఉంది. ఎకరానికి రూ.30 వేల వరకు ఆదాయం పొందవచ్చు.



ఉలవలు: వర్షాభావ పరిస్థితుల్లో ఈ ప్రాంతానికి మిక్కిలి అనుకూలమైన పంట. సెప్టెంబర్ నుంచి అక్టోబర్ దాకా విత్తుకోవచ్చు. నాట్లు ద్వారా అయితే ఎకరానికి పది కిలోల విత్తనాలు అవసరం. వెదజల్లే పద్ధతిలో 16 కిలోలు అవసరం. పంట దిగుబడి బాగా ఉంటే ఎకరానికి ఆరు క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. ప్రస్తుతం క్వింటాల్ ధర రూ.3వేల దాకా ఉంది. పశువులకు మేతగానూ ఉపయోగ పడుతుంది.



జనుము: పండ్ల తోటలు గల రైతులు ఈ వర్షాకాలంలో జనుము, పిల్లి పెసర విత్తనాలను చెట్ల మధ్యల్లో చల్లుకోవాలి. దీని ద్వారా పశువులకు దాణా దొరుకుతుంది. పశు గ్రాసం విక్రయించుకున్నా ఎకరానికి రూ.16 వేల వరకు ఆదాయం వస్తుంది. లేదా కలియ దున్నితే భూమిలో సేంద్రీయ కర్బణం పెరిగి పొలం సారవంతంగా మారుతుంది.



వేతన బకాయిలు చెల్లించాలని వినతి



వినతిపత్రం అందిస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

పలమనేరు: వేతన బకాయిలను వెంటనే చెల్లించాలని పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో పనిచస్తున్న పారిశుద్ధ్య కార్మికులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆస్పత్రి సూపరిండెంటెంట్ మమతారాణికి వినతి పత్రం అందిందు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చాలీచాలని వేతనాలతో కుటుంబాలను నెట్టుకొస్తున్నామన్నారు. ఈ పరిస్థితుల్లో ఐదు నెలలుగా జీతాలు ఇవ్వకుంటే పొట్ట పోషణ కష్టతరంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం పారిశుద్ధ్య పనులకు వినియోగించే చేతి తొడుగులు, యూనిఫామ్, పాదరక్షలను సైతం అందించడం లేదని వాపోయారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తమ సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో పారిశుద్ధ్య కార్మిక సంఘం నేతలు లోకేష్, విజయమ్మ, బుజ్జమ్మ, ఈశ్వరమ్మ, నారాయణమ్మ, రామకృష్ణ పాల్గొన్నారు.

బాలింతలకు బేబీకిట్‌ల పంపిణీ



బేబీ కిట్ అందిస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

వి.కోట: లయన్స్‌క్లబ్ వారు శుక్రవారం స్థానిక సీహెచ్‌సీలో బాలింతలకు బేబీ కిట్‌లు, అల్పాహారం పంపిణీ చేశారు. వి.కోట లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ధీరజ్ మాట్లాడుతూ ప్రతినెలా 5 తేదీన సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు వెల్లడించారు. మురుగేష్, లక్ష్మణ్ చౌదరి, డాక్టర్ తమీమ్, మంజునాథ్, శబరీష్, నాగభూషణం, సురేంద్రగౌడ, రంగనాథ్ పాల్గొన్నారు.

స్కానింగ్ సెంటర్లలో తనిఖీలు



స్కానింగ్ సెంటర్ తనిఖీ చేస్తున్న అధికారులు

పలమనేరు: పట్టణంలోని పలు స్కానింగ్ సెంటర్లను జిల్లా పీసీపీఎన్‌డీటీ చట్టం ఇన్‌చార్జి నోడల్ ఆఫీసర్ డాక్టర్ శిరీషా శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా శుక్రవారం స్థానిక ఏరియా ఆస్పత్రిలో వైద్యులతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ లింగ నిర్ధారణ నిషేధ చట్టాన్ని ప్రభుత్వం పకడ్బందీగా అమలు చేస్తోందన్నారు. ప్రైవేటు స్కానింగ్ సెంటర్లలో లింగత్వ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. దీనిపై ఎక్కడికక్కడ వైద్యులు నిఘా పెట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఏరియా ఆస్పత్రి సూపరిండెంటెంట్ డాక్టర్ మమతారాణి పాల్గొన్నారు.

పలమనేరులో 'ఫైనాన్స్' దందా!



- పట్టణంలో తిష్టవేసిన తమిళ ముఠాలు
- పేదలే లక్ష్యంగా అధిక వడ్డీలకు అప్పులు
- తిరిగి చెల్లించకుంటే వేధింపులు
- 'తంబీ'ల ఆగడాలకు బలవుతున్న బాధితులు
- ఇదే మార్గంలో ఇబ్బడిముబ్బడిగా వెలిసిన ప్రైవేట్ సంస్థలు

పలమనేరు నియోజకవర్గంలో తమిళనాడుకు చెందిన ముఠాలు తిష్టవేశాయి. డైలీ.. వీక్లీ ఫైనాన్స్ వ్యాపారం పేరుతో నిరుపేదల రక్తం పీలుస్తున్నాయి. అధిక వడ్డీలతో రుణాలు ఇస్తూ యథేచ్ఛగా దోచుకుంటున్నాయి. ష్యూరిటీ లేకుండా సులువుగా అవసరానికి డబ్బులు చేతికందుతున్నాయని పలువురు వీరి కబంధ హస్తాల్లో చిక్కుకుంటున్నారు. వడ్డీల భారం మోయలేక ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. ఇదే తరుణంలో స్థానికంగా సైతం కొందరు ప్రైవేట్ సంస్థలను ఏర్పాటు చేసుకుని ఎక్కువ వడ్డీలు గుంజుతున్నారు.

పలమనేరు: నియోజకవర్గంలో తమిళ తంబీల వడ్డీ వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతోంది. వీరు అడిగిన వారికి కాదనకుండా రూ.3కోట్లకు పైగా అప్పులిచ్చినట్లు తెలుస్తోంది. అధిక వడ్డీలు గుంజుతున్నా పోలీసులకు పిర్యాదు చేసేందుకు సైతం జనం జంకుతున్నారు. మరోవైపు పట్టణంతోపాటు మండల కేంద్రాల్లో పలు ప్రైవేటు సంస్థలు సైతం రుణాలు అందిస్తూ ఎక్కువ వెడ్డీలు వసూలు చేస్తున్నాయి.

ఇదీ దుస్థితి

పురపాలక పరిధిలోని గంటావూరు కాలనీలో వడ్డీ వ్యాపారుల వేధింపులు తాళలేక కొందరు బయటి ప్రాంతాలకు వెళ్లిపోయారు. ఇటీవల అధిక వడ్డీలు కట్టలేక ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మరోవ్యక్తి తీవ్ర ఆవేదనతో గుండెపోటుకు గురై చనిపోయాడు. స్థానిక వైఎస్సార్ కాలనీలోనూ ఓ మహిళ మానసిక ఒత్తిడి భరించలేక కన్నుమూసిది. వడ్డీ వ్యాపారుల వేధింపులను తట్టుకోలేక, బయటికి చెప్పులేక మరికొందరు బలవన్మరణాలకు పాల్పడ్డారు.

నూటికి రూ.5 పైనే..

కొన్నేళ్లుగా గుడియాత్తం, ఆంబూర్, పేర్నాంబట్, చెన్నై, వేలూరులకు చెందిన కొందరు ఫైనాన్స్ కంపెనీలకు చెందిన ప్రతినిధులు బైక్‌లపై పలమనేరు ప్రాంతంలో తిరుగుతూ స్లమ్ ఏరియాలు, గ్రామాల్లోని దుకాణాలు, ఆటోవాళ్లు, తోపుడుబండ్ల వ్యాపారులు, ఒంటరి మహిళలకు రుణాలు అందిస్తున్నారు. నూటికి రూ.5 పైగా వడ్డీతో కేవలం ఆధార్ కార్డు మాత్రమే తీసుకుని చిటికెలో ఫైనాన్స్ ఇస్తున్నారు. లోను తీసుకోవడం చాలా సులభంగా ఉందంటూ పలువురు వీరి నుంచి అప్పులు తీసుకుంటున్నారు. ఈ అప్పులు వడ్డీతో కలిపి ఠంచనుగా వసూలవుతుండడంతో అక్కడి వ్యాపారులు మరింత మంది ఈ ప్రాంతంలో మకాం వేశారు. దీంతో డైలీ ఫైనాన్స్ వ్యాపారులు పెరిగి ఎవరికి పడితే వారికి తగిన జామీన్లతో అధిక వడ్డీతో డబ్బులివ్వడం మొదలు పెట్టారు. ఇక పట్టణంతో పాటు అన్ని మండలకేంద్రాల్లో ప్రైవేటుకు చెందిన పదుల సంఖ్యలో తక్షణమే అప్పులిచ్చే కంపెనీలు స్థానికంగా భారీగానే వెలిశాయి. భర్తకు భార్య జామీనుంటే చాలు డబ్బులిచ్చేస్తున్నారు. ఆపై కట్టకుంటే ఇళ్ల వద్ద కెళ్లి వేధింపులకు గురి చేస్తున్నారు.

పేదలే టార్గెట్

పట్టణంలోని గంటావూరు, గొబ్బిళ్ల కోటూరు, కాకాతోపు, పాతపేట, గంగవరం, శ్రీలంకకాలనీ, దండుమిట్ట, నాగమంగళం, కొలమాసనపల్లె, టి.వడ్డూరు, కాలువపల్లె, బైరెడ్డిపల్లె మండలంలోని బైరెడ్డిపల్లె చెక్‌పోస్టు, కడపనత్తం, లక్కనపల్లె, తీర్థం , దేవదొడ్డి, వి.కోట మండలంలో ఈ వ్యాపారం జోరుగా సాగుతోంది.

బెదిరించి వసూలు

అప్పు తీసుకున్న వారు సమయానికి కంతులు కట్టకపోతే ఏజెంట్ల బెదిరింపులు ఘోరంగా ఉంటాయని కొందరు బాధితులు తెలిపారు. రోజూ తమిళనాడు నుంచి బైక్‌లపై వచ్చి ఈ వ్యాపారం సాగిస్తున్నారని వెల్లడిస్తున్నారు. ఫైనాన్స్ నిర్వహించేందుకు లైసెన్స్ కూడా లేకుండా తమిళ తంబీలు ఇక్కడి పేదల రక్తాన్ని వడ్డీగా పీల్చేస్తున్నా పోలీసులు ఏమీ చేయలేని పరిస్థితి ఏర్పడింది. దీంతో వ్యాపారులు మరింత రెచ్చిపోతున్నారు. పేదలను తీవ్రంగా ఇబ్బంది పెడుతున్నారు.

అగ్నిప్రమాద బాధితుడికి ఆర్థిక సాయం



బాధిత కుటుంబానికి సాయం అందిస్తున్న దాతలు

పలమనేరు: పట్టణ సమీపంలో ఇటీవల సంభవించిన అగ్ని ప్రమాదంలో తీవ్రంగా గాయపడి వైద్యానికి, కుటుంబ పోషణకు ఇబ్బంది పడుతున్న లారీ క్లీనర్ హరికి స్థానిక మానవహక్కుల మండలి కార్యవర్గ సభ్యులు రూ.10వేల ఆర్థికసాయం అందించారు. శుక్రవారం ఈ మేరకు బాధితుడి ఇంటికి వెళ్లి నగదు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హరి ఇబ్బందులు తమ దృష్టికి రావడంతో మానవతా దృక్పథంతో చేయూతనందించినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో మండలి నేతలు దర్బార్ సుభాన్, అహ్మద్ షరీఫ్, రమేష్, అశ్రఫ్, బద్రున్నీసా, సాజియా, నూరజ్, గౌష్‌బాషా పాల్గొన్నారు.

ఏఐఎస్ఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక



ఎన్నికైన కొత్త కార్యవర్గం

పలమనేరు: ఏఐఎస్ఎఫ్ పలమనేరు శాఖ నూతన కార్యవర్గ ఎంపికను సంఘం జిల్లా కన్వీనర్ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం చేపట్టారు. పట్టణంలోని డిగ్రీ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో సంఘం నియోజకవర్గ అధ్యక్షుడిగా తేజస్, కార్యదర్శిగా షేక్‌బాబు, ఉపాధ్యక్షులుగా పార్థివ్, తరుణ్, యుగంధర్, కార్యదర్శులుగా ముషారఫ్, బాలాజీ, మన్సూర్, కార్యవర్గ సభ్యులను ఎన్నికయ్యారు. జిల్లా కన్వీనర్ మాట్లాడుతూ రాష్ట్రంలో నెలకొన్న విద్యా సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా తల్లికి వందనం, ఫీజు రీయింబర్స్‌మెంట్ నగదును విడుదల చేయాలని కోరారు.

'టీచ్ టూ టూల్' శిక్షణ తనిఖీ



మాట్లాడుతున్న డీఈఓ దేవరాజు

పలమనేరు: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహిస్తున్న టీచ్ టు టూల్ శిక్షణ కార్యక్రమాన్ని డీఈవో దేవరాజు శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ తరగతి గదిలో పిల్లల మనోభావాలు తెలుసుకుని ఎలా పాఠ్యాంశాలు బోధించాలో తెలియజేసేందుకు ప్రభుత్వం ఈ శిక్షణ ఇప్పిస్తున్నట్లు వెల్లడించారు. ఇందులో నేర్చుకున్న అంశాలను తరగతి గదిలో అమలు చేయాలని సూచించారు. ముఖ్యంగా టీచర్ల డ్రెస్‌కోడ్ బాగుండాలని, గురువు ప్రవర్తను పిల్లలు గమనిస్తూ ఉంటారని తెలిపారు. సబ్జెక్ట్‌పై టీచర్లు మంచి పట్టు సాధిస్తే బోధన సులభంగా ఉంటుందని వివరించారు. కార్యక్రమంలో ఎంఈఓ లీలారాణి, ఏఎల్ఎస్ కో–ఆర్డినేటర్ అజయ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.